

క్లుప్తంగా

సజ్జలను కలసిన శివకుమార్


సజ్జలను కలసిన పాటి శివకుమార్


మలికిపురం: రాజోలు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తపేట నియోజకవర్గ పరిశీలకుడు పాటి శివకుమార్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామ కృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన రాష్ట్ర కార్యదర్శుల సమావేశంలో ఈ మేరకు కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

43 మందికి ఉచిత కంటి పరీక్షలు

పి.గన్నవరం: మండలంలోని ముంగండలో మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 43 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వారిలో 14 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ధారించి, వేమగిరి కంటి ఆస్పత్రికి తరలించినట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోనసీమ తిరుమలగా వాడపల్లి వైభవం


ప్రస్తుత బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రం


శ్రీవేంకటేశ్వర స్వామివారు

కొత్తపేట: తిరుమల-తిరుపతి (పెద్ద తిరుపతి), ద్వారకా తిరుమల (చిన్నతిరుపతి) తరువాత అత్యంత భక్తజనాదరణ పొందిన పుణ్యక్షేత్రం వాడపల్లి క్షేత్రం. గౌతమీ-వశిష్ట గోదావరి నదుల నడుమ, గౌతమీ నదికి అతి సమీపాన అందమైన పచ్చని పంట పొలాల మధ్య, ప్రకృతి అందాల నడుమ వేంకటేశ్వరస్వామి స్వయంభువుగా వెలసిన పుణ్యక్షేత్రం వాడపల్లి. దీనికి కొద్ది దూరంలోనే విజ్జేశ్వరం సమీపాన మరో వాడపల్లి ఉన్నందున, లొల్ల గ్రామానికి ఆనుకొని ఉండటంతో లొల్ల వాడపల్లి, చిన్న వాడపల్లిగా పిలిచేవారు.

గత కొన్నేళ్లుగా అత్యంత భక్తజనాదరణతో వాడపల్లి అంటే ఈ కోనసీమ తిరుమల వాడపల్లి పేరు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మార్మోగుతుంది. ప్రతిరోజు ముఖ్యంగా 'ఏడు వారాల వెంకన్న దర్శనం -ఏడేడు జన్మల పుణ్యఫలం' అనే నానుడి, విశ్వాసంతో ప్రతి శనివారం భక్తులు అత్యధిక సంఖ్యలో ఏడు ప్రదక్షణలు నిర్వహించి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

దాంతో ఇంతింతై వటుడింతై అన్నట్టు సుమారు పది, పన్నెండేళ్లలో ఈ క్షేత్రం భక్తజనసంద్రమై రాష్ట్రంలో మరో ప్రముఖ దివ్య క్షేత్రం స్థాయికి చేరింది. తద్వారా ఈ క్షేత్రం కోనసీమ ప్రాంతంలో ఉన్నందున కోనసీమ తిరుమలగా, రాష్ట్రంలో మూడో తిరుపతిగా ప్రసిద్ధి చెందింది. తిరుమల (పెద్ద తిరుపతి) తరహాలోనే ఈ కోనసీమ తిరుమల (వాడపల్లి) క్షేత్రంలో కూడా స్వామివారికి నిత్య, మాస, వార్షిక కల్యాణ, వార్షిక బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.

చైత్రమాసంలో కల్యాణోత్సవాలు

అనాదిగా ఈ క్షేత్రంలో చైత్రశుద్ధ దశమి నుంచి చైత్రశుద్ధ బహుళ పాడ్యమి వరకూ వారం రోజుల పాటు శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. చైత్రశుద్ధ దశమి నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా వరుసగా 7 రోజులు అంకురార్పణ, ధ్వజారోహణం, స్వామి వారి కల్యాణం, తీర్థం, రథోత్సవం, పొన్నవాహనంపై గ్రామోత్సవం, మహదాశీర్వచనం, సదస్యం, గోదావరి నదిలో తెప్పోత్సవం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, స్వామి వారి పుష్పోత్సవం తదితర కార్యక్రమాలతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. ఆ విధంగా ఈ ఏడాది ఏప్రిల్ 7 నుంచి 13 వరకూ దేవదాయ-ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఆశ్వయుజ మాసంలో బ్రహ్మోత్సవాలు

ఈ క్షేత్రంలో ఆశ్వయుజ బహుళ చవితి నుంచి బహుళ ద్వాదశి వరకు 9 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆ ప్రకారం ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 వ తేదీ నుంచి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.







తిరుమల తరహాలో బ్రహ్మోత్సవాలు


ఈఓ నల్లం సూర్యచక్రధరరావు

కొత్తపేట: గతేడాది ఈ దేవస్థానానికి ఈఓగా వచ్చిన దేవదాయ-ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు కృషి, ఆలోచనా విధానం మేరకు ఉచిత, వివిధ రుసుములతో దర్శనాలకు సంబంధించి క్యూలైన్లు పెంచారు. ముఖ్యంగా తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఏఏ కార్యక్రమాలు జరుగుతాయో ఆ కార్యక్రమాలన్నీ ఇక్కడ కూడా నిర్వహిస్తున్నాం. గత వార్షిక బ్రహ్మోత్సవాల కంటే మించి ఈ బ్రహ్మోత్సవాలకు భక్తుల సంఖ్య పెరిగింది. ఈ బ్రహ్మోత్సవాల్లో రెండు శనివారాలు వచ్చాయి. ఓ పక్క ప్రతి శనివారం వచ్చే సాధారణ భక్తులు, ఏడు శనివారాల దర్శనం భక్తులతో పాటు బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకంగా వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకుంటున్నాం. ఆ మేరకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పర్యవేక్షణలో ఎక్కడా భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. అలాగే ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు అందరూ సహకరిస్తున్నారు. ఇప్పటికే 5 రోజులు పూర్తికాగా, మరో నాలుగు రోజులు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమాలన్నీ విజయవంతం చేయాలని దేవస్థానం తరఫున కోరుతున్నాం.





కూటమి నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


పార్టీలో చేరిన చిన్న తదితరులతో మాజీ మంత్రి సూర్యారావు, పరిశీలకుడు పాపారాయుడు

మలికిపురం: రాజోలు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన సోషల్ యాక్టివిస్ట్ నల్లి చిన్న తన 15 మంది సహచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. మంగళవారం మలికిపురంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకుడు నేతల నాని ఆధ్వర్యంలో మాజీ మంత్రి, రాజోలు వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు సమక్షంలో పార్టీలో చేరారు. నల్లి చిన్న ఇప్పటి వరకూ తన వీఆర్ ఇండియన్ సోషల్ సర్వీస్ ద్వారా సుమారు రూ.70 లక్షలు పలువురికి సాయం చేస్తూ సేవాకార్యక్రమాలు నిర్వహించారు. నల్లి చిన్న మాట్లాడుతూ కూటమి పాలనపై విసుగు చెంది జగన్ చేసిన పాలన పోరాటం పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. పరిశీలకుడు కర్రి పాపారాయుడు, పార్టీ నాయకులు గుర్రం జాషువా, మోకా సురేష్, కూనప రెడ్డి రాంబాబు, గుబ్బల వీవీ సత్యనారాయణ, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

ఉపాధి పథకంలో గ్రామీణాభివృద్ధి

కొత్తపేట: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధించాలని, అదే ఈ పథకం లక్ష్యమని కేంద్ర బృందం సభ్యులు ఉమేష్‌కుమార్ రామ్ (జేడీ), మయూర్ వర్మ (సెక్షన్ ఆఫీసర్) అన్నారు. ఉపాధి పథకం పనులు పరిశీలనలో భాగంగా మంగళవారం వారు మండలంలోని బిళ్లకుర్రులో పర్యటించి ఉపాధి పనులను, పండ్ల తోటలను, సీసీ రోడ్డును, డ్వాక్రా క్వాయర్ ఇండస్ట్రీని పరిశీలించారు. ఉపాధి కూలీలు, పథకం లబ్ధిదారులతో ముఖాముఖి సమీక్షించారు. ఉపాధి పథకం వలన ఉపయోగం ఉందా? కుటుంబాలకు ఏ మేరకు లబ్ధి చేకూరుతుంది వంటి అంశాలను ఆరా తీశారు. అలాగే డ్వాక్రా క్వాయర్ పరిశ్రమ నిర్వహిస్తున్న మహిళలను కలిసి పరిశ్రమ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఆయా అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

గేదెల దాడిలో చనిపోయిన కొండముచ్చు

అయినవిల్లి: మండలంలోని మాగం గ్రామంలో ఐదుగురిపై దాడి చేసి గాయపరచిన కొండముచ్చు ఓ రైతు మకాంలో గేదెలు కొమ్ములతో దాడి చేసి గాయపరిచాయి. వైద్యం అందించేలోపే ఆ కొండముచ్చు చనిపోయింది. మంగళవారం డివిజనల్ ఫారెస్టు అధికారి ఈశ్వరరావు నేతృత్వంలో ముగ్గురు అధికారులు కొండముచ్చును పట్టుకునేందుకు మాగం పంటపొలాల్లో గాలించారు. అయితే ఈ కొండముచ్చును ఓ రైతు మకాంలో ఉన్న గేదెల దాడిలో కొండముచ్చు తీవ్రంగా గాయపడడాన్ని అధికారులు గమనించి వైద్యం అందించేసరికి ఆ కొండముచ్చు చనిపోయిందని ఫారెస్టు అధికారులు తెలిపారు.















సంపూర్ణ పారిశుధ్యానికి సహకరించాలి

అంబాజీపేట: సంపూర్ణ పారిశుధ్యానికి ప్రతి ఒక్కరూ సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతాలక్ష్మి అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం డీపీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. డీపీఓ మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరువేరుగా ఉంచాలని వాటిని పంచాయతీ పారిశుధ్య కార్మికులు తీసుకువెళతారన్నారు. తడి, పొడి చెత్త పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్, పంచాయతీ అధికారి సీహెచ్ మౌనిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డీసీఎం పవన్ పర్యటన వాయిదా

మలికిపురం: ఈనెల 17వ తేదీన రాజోలు నియోజకవర్గంలో జరగాల్సిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా పడినట్లు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. మలికిపురంలో ఎల్ఎస్ ల్యాండ్ మార్కు నందు మంగళవారం జరిగిన కూటమి నేతల సమావేశంలో ఆయన ఈ మేరకు ప్రకటించారు. ఈ నెల 16న కర్నూలులో పీఎం మోదీ పర్యటన నేపథ్యంలో పవన్ పర్యటన వాయిదా పడిందన్నారు. తదుపరి తేదీ ప్రకటిస్తామన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మలికిపురం: శంకరగుప్తం డ్రెయిన్ ఉప్పునీటి వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుని, కొబ్బరి చెట్లు కోల్పోయిన ఒక్కో చెట్టుకు రూ.10 వేలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. మంగళవారం కేశనపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో ఆయన పర్యటించారు. ఉప్పునీరు భూమి పీల్చుకోవడంతో వేల సంఖ్యంలో కొబ్బరిచెట్లు చనిపోయాయన్నారు.

బాణసంచా విక్రయదారులు లైసెన్సులు తీసుకోవాలి



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ చినబాబు

అంబాజీపేట: బాణసంచా విక్రయదారులు తాత్కాలిక లైసెన్స్ తీసుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.చినబాబు అన్నారు. రానున్న దీపావళిని పురస్కరించుకుని తాత్కాలిక లైసెన్స్‌దారులు విక్రయించే స్థలాలు అంబాజీపేట, పుల్లేటికుర్రు, కె.పెదపూడి, ముక్కామల జెడ్పీ హైస్కూల్ ప్రాంగణాలను మంగళవారం తహసీల్దార్ పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాణాసంచా విక్రయ ప్రదేశాలను తనిఖీ చేస్తున్నామన్నారు. నిబంధనలకు అనుగుణంగా బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. లైసెన్స్‌లు లేకుండా బాణాసంచా విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ కె.ఏడుకొండలు , వీఆర్వోలు జీవీ రమణ, జి.వెంకటేశ్వరరావు, ఐవీవీ రమేష్ ఉన్నారు.

గురుస్వామి శర్మ దంపతులకు ఘన సన్మానం



వాడపాలెంలో రామచంద్రశర్మ-ఆదిలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కొత్తపేట: మండలంలోని వాడపాలెం జ్ఞాన సరస్వతీదేవి, అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, అయ్యప్ప దీక్ష గురుస్వామి దొంతికుర్తి రామచంద్రశర్మ దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. రామచంద్రశర్మ 2017 నుంచి వాడపాలెంలో ఆలయ ప్రధాన అర్చకుడిగా సేవ చేస్తున్నారు. సుదీర్ఘ కాలంగా ఆయన అయ్యప్ప మాల ధరిస్తున్నారు. ఏటా అత్యధిక సంఖ్యలో స్వామి అయ్యప్ప మండల, జ్యోతి దీక్ష మాలధారులు రామచంద్రశర్మ చేతుల మీదుగా అయ్యప్పమాల ధరించడం, 41 రోజుల అనంతరం ఇరుముడులు కట్టించుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం అయ్యప్ప మండల దీక్ష చేపట్టిన నేపథ్యంలో వాడపాలెం అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో గురుస్వామి రామచంద్రశర్మ-ఆదిలక్ష్మి దంపతులను పూలమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలు, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. అనంతరం శర్మ దంపతులు సుమారు 300 మంది మాలధారులు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ మట్టా బాబ్జి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక ఎస్సీ నాయకులకే టీడీపీ ఇన్‌చార్జి పదవి ఇవ్వాలి



పి.గన్నవరం టీడీపీ ఇన్‌చార్జి పదవి దళితులకే ఇవ్వాలని నినాదాలు చేస్తున్న దళిత నాయకులు

పి.గన్నవరం: నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పదవిని కష్టపడి పనిచేసే స్థానిక ఎస్సీ నాయకులకే ఇవ్వాలని ఆ పార్టీకి చెందిన దళిత నాయకులు మంగళవారం సాయంత్రం పి.గన్నవరంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. మూడు రోడ్ల సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 60 వేల మంది ఎస్సీలు ఉన్నారని వివరించారు. స్థానిక ఎస్సీ నాయకులకే టీడీపీ ఇన్‌చార్జి పదవి ఇవ్వాలని, ఇతర నియోజకవర్గాలకు చెందిన వారికి పదవి ఇస్తే తాము అంగీకరించమని అన్నారు. ఈ మేరకు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ దళిత నాయకులు ఆకుమర్తి ఆశీర్వాదం, చుట్టుగుల్ల కిషోర్, బొండాడ నాగమణి, జాలెం సుబ్బారావు, పెదపూడి శ్రీను, పైడి బుజ్జి, కేదాసి చిన్న, ఉండ్రావజరపు అబ్బు, పాలమూరి సత్తిబాబు, మందా రాజేష్, పాలమూరి సత్తిబాబు, గోగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సన్మానం



ఉపాధ్యాయిని ప్రతిభను సన్మానిస్తున్న గ్రామస్తులు

మలికిపురం: మండలంలోని రామరాజులంక గ్రామం పెదతిప్ప మండల ప్రజాపరిషత్ స్కూల్‌లో సుమారు మూడు సంవత్సరాల పాటు ఉపాధ్యాయినిగా పనిచేస్తూ స్కూల్ ఎన్‌రోల్ పెరగడానికి విద్యార్థులకు చక్కటి విద్యను అందించడానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయురాలు ఇంజేటి ప్రతిభను గ్రామస్తులు అభినందించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ప్రతిభను గ్రామస్తులు అభినందిస్తూ శాలువతో సత్కరించారు. ఆమె సేవలను గ్రామ తెలగా సంఘం అధ్యక్షుడు తిరుమల గవర్రాజు కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నల్లి శివకుమార్, తిరుమల గోపాలకృష్ణ పాల్గొని స్కూల్ విద్యార్థులకు చక్కటి తర్ఫీదును అందించిన ప్రతిభను అభినందించారు.

ఎడతెరిపి లేని వర్షం.. ప్రయాణికులకు ఇక్కట్లు



అప్పనపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

అంబాజీపేట: అల్పపీడన ప్రభావంతో మంగళవారం వేకువజాము నుంచి కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రయాణికులు, వాహనదారులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సైకిల్ షెడ్ వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్, ముక్కామల, పుల్లేటికుర్రు ప్రధాన రహదారులన్నీ జనజీవనం లేక స్తంభించిపోయాయి. చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

డ్రైనేజీ లేక రోడ్లపైనే ముంపు నీరు

మామిడికుదురు: మామిడికుదురు, నగరం గ్రామాల్లో జాతీయ రహదారితో పాటు మామిడికుదురు గ్రామ పరిధిలోని పలు రోడ్లు వర్షం నీటితో ముంపుబారిన పడ్డాయి. ప్రధానంగా డ్రైనేజీ సదుపాయం లేక ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముంపు నీరు వెళ్లేందుకు కనీసం కచ్చా డ్రైన్లు అయినా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వీటితో పాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో సైతం రోడ్లపై ముంపు నీరు నిలిచిపోయింది. రోడ్లపై ముంపు నీరు నిలిచిపోవడంతో రోడ్లు దారుణంగా దెబ్బతింటున్నాయి. ముంపునీటి మళ్లింపునకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాడు ఓడపల్లి.. నేటి వాడపల్లి



నాడు వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం (ఫైల్)

కొత్తపేట: వాడపల్లి దేవాలయంలోని మూర్తి దారు మూర్తి. నల్లని చెక్కపై చెక్కిన ఈ విగ్రహం చూసేందుకు శిలలాగే ఉంటుంది. ఇక్కడ గల శిలా ఫలకం ఆధారంగా ఈ క్షేత్ర చరిత్ర ఈ విధంగా ఉంది. వైకుంఠంలో ఒకసారి సనకసనందాది మహర్షులు నారాయణుని దర్శించుకునేందుకు వచ్చి భూలోకమున పాపం, అధర్మం, అన్యాయం పెరుతున్నవి వాటిని తగ్గించు మార్గం చూపమని వేడుకొన్నారు. అప్పుడు విష్ణువు వారితో అధర్మం ప్రబలినపుడు నేను అనేక రూపాల్లో అవతరించాను. అలాగే కలియుగంలో గౌతమీ ప్రవాహ మార్గంలో నౌకాపురం అను ప్రదేశాన వెలుస్తాను. ఈ విషయాలను నారదుని ద్వారా ప్రజలకు తెలియజేయమని చెప్తాడు. ఆ ప్రకారం కలియుగంలో సుమారు 400 ఏళ్ల క్రితం గౌతమీ నదీ తీరాన వున్న నౌకాపురి తరువాత ఓడపల్లి (నేటి వాడపల్లి) ఋషి పుంగవులతో తపోవనంగా విరాజిల్లేది. ఆ కాలంలో దండకారణ్యమైన ఈ ప్రాంతంలో స్వయంభూవై రక్తచందనంతో శ్రీ వేంకటేశ్వర స్వామి మూర్తిభవించారు. రక్త చందనం రూపంలో గోదావరి నదిలో స్వామి వారి విగ్రహం ఉన్నట్టు భక్తులకు కలలో చెప్పి ఆవిర్భవించినట్లు కథ ప్రచారంలో ఉంది. స్వయంభూవై రక్తచందనంలో లభించిన వేంకటేశ్వర స్వామి వారి విగ్రహాన్ని ఋషులు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకోచ్చి ఆగమశాస్త్రం ప్రకారం విగ్రహం లభించిన ప్రాంతంలో ఏటి ఒడ్డున విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రస్తుతం పూజలందుకుంటున్న చోట పినపోతు గజేంద్రుడు అనే అగ్నికుల క్షత్రియ వంశానికి చెందిన సంపన్నుడు 1759లో ఆలయాన్ని నిర్మించి తిరిగి పునః ప్రతిష్ఠించినట్లు చరిత్ర ఆధారంగా తెలుస్తోంది. గజేంద్రుడికి స్నేహితుడు, ప్రాంతీయ పరిపాలకుడైన పెద్దాపురం మహారాజు రాజా వత్సవాయి తిమ్మ జగపతిరాజు అప్పట్లో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్వహణకు 275 ఎకరాల భూమిని విరాళంగా సమకూర్చారు. దీప ధూప నైవేద్యాల కోసం 110 ఎకరాలు, స్వామి వారి సేవల నిమిత్తం 165 ఎకరాల భూమి సమర్పించారు. విరాళంగా ఇచ్చిన భూములను అర్చక మాన్యాలు, మాదశి మాన్యం, రజక, మంగలి, సన్నాయి, ధూపదీప నైవేద్యం మాన్యాల కింద స్వామి వారికి సర్వ హక్కులు కల్పించారు. ఆ భూములపై వచ్చే ఆదాయంతో నాటి నుంచీ వీరంతా జీవనం సాగిస్తూ స్వామి వారికి సేవలు అందించేలా చేయడంతో ప్రతి రోజు ధూపదీప నైవేద్యాలు క్రమం తప్పకుండా అందుతున్నాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి కార్యక్రమాలు



వాడపల్లి క్షేత్రంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కొత్తపేట: ఇంతింతై వటుడింతై అన్నట్టు ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రం తిరుమల తరహాలో భక్తజన సంద్రంగా మారిన నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ క్షేత్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అప్పటి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కృషి మేరకు రూ.కోట్లతో ఈ క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఆవరణలో గోశాల, భారీ రేకు షెడ్లు, అన్నదాన భవనం నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. రూ.55 కోట్లతో ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్, రూ 5.5 కోట్లతో వకుళమాత అన్నప్రసాద భవనం ఏర్పాటు, రూ.2.50 కోట్లతో స్వామి వారి తెప్పోత్సవం నిర్వహించేందుకు టీటీడీ తరహాలో కోనేరు ఏర్పాటు చేస్తున్నారు. కాలినడకన వచ్చే భక్తులకు విశ్రాంతి, సామూహిక వివాహాలు, ఉపనయనాలు జరిపేందుకు వీలుగా రూ.కోట్లతో మూడు అంతస్తుల భవనం నిర్మాణం చేపట్టారు. రూ.65 లక్షలతో స్వామికి శాశ్వత వార్షిక కల్యాణ వేదిక ఊబలంక, రావులపాలెం కాంట్రాక్టర్లు నిర్మించారు. టాయిలెట్స్, బస్సు షెల్టర్ నిర్మాణం చేపట్టారు. రూ.22 లక్షలతో తాగునీటి కోసం వాటర్ ప్లాంట్, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేశారు. తాజాగా ఉచిత, వివిధ రుసుముల దర్శనానికి సంబంధించి క్యూలైన్లు పెంచారు. ఫ్లెక్సీవర్ ఏర్పాటు చేశారు. రావులపాలెం-బొబ్బర్లంక నుంచి కాలినడకన వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా దారి పొడవునా వీధిదీపాలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. అన్నప్రసాదం భవనం, షెడ్లు నిర్మించారు. ప్రతిరోజు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నప్రసాదం భక్తులకు అందిస్తున్నారు.

డిప్యూటీ సీఎంను తీసుకురావాలని రైతుల వినతి

మామిడికుదురు: పాశర్లపూడిలో ఓఎన్జీసీ వల్ల ఎదుర్కొంటున్న ముంపు సమస్యను పరిశీలించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను తీసుకురావాలని పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాలకు చెందిన రైతులు పి.గన్నవరంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కోరారు. ఎమ్మెల్యేను మంగళవారం కలిసి ఈ ప్రతిపాదన చేశారు. ఓఎన్జీసీ నిర్మించిన రోడ్ల వల్ల వాడబోది మీడియం డ్రైన్ నుంచి వచ్చే ఉప్పు నీటి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్న విషయాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. రాజోలు నియోజకవర్గం పర్యటనకు వస్తున్న పవన్‌ను ఇక్కడ రైతులు ఎదుర్కొంటున్న సమస్యను కూడా పరిశీలించే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న ముంపు సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లానని ఇక్కడ కూడా పర్యటించాలని కోరానని ఎమ్మెల్యే రైతులకు తెలిపారు. ఈ ప్రాంతంలో పవన్ పర్యటనపై ఇంకా స్పష్టత రాలేదన్నారని రైతులు పేర్కొన్నారు.

బాధితుడి వైద్యానికి రూ.15 వేల సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి అనారోగ్యం పాలైన బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి చెందిన నల్లమిల్లి సత్తిరెడ్డి (79) గతంలో యాక్సిడెంట్ అయ్యి కాలికి రాడ్లు వేశారు. అది ఇప్పుడు ఇన్ఫెక్షన్‌కి దారి తీసింది. ఈయన ముగ్గురు కొడుకుల్లో ఇద్దరు చనిపోయారు. ఇంకొకరు పని చేసుకునే పరిస్థితుల్లో లేక పోషించేవారు ఎవరూ లేరు. వైద్యం చేయించుకునే స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. నర్సిపూడి వెళ్లి సత్తిరెడ్డికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.15 వేల చెక్కు అందజేసినట్టు తెలిపారు.